ప్రభుత్వ భూమిని కాపాడాలని మంత్రికి వినతి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న భాస్కరరెడ్డి

గచ్చిబౌలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ సర్వేనెంబర్ 100 ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూమిపై సుప్రీంకోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఉన్నా ధరణిలో పట్టా పాస్‌బుక్ ఇవ్వడంపై సమగ్ర దర్యాప్తు విచారణ జరిపించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి వినతి పత్రం అందజేశారు. మియాపూర్ సర్వేనెంబర్ 100, 101లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూమిలో గతంలో కొందరు కబ్జా చేసి అన్ని న్యాయస్థానాల్లో ఓటమి చెంది చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

తులసీనగర్‌లో రోడ్లు పరిశీలించిన కార్పొరేటర్



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసీనగర్ సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత విషయంలో రాజీపడకుండా సీసీ రోడ్డు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు రామకృష్ణ, మల్లేష్, నాగరాజు, సాయి, వర్క్ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



డివైడర్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

ఆదిత్యనగర్‌లో సెంట్రల్ డివైడర్ పనులు

హైదర్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్‌లో నూతనంగా చేపట్టిన సెంట్రల్ డివైడర్ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని సెంట్రల్ డివైడర్ వంటి అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, కాలనీ, బస్తీల్లోని సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అధికారులు వర్క్ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున్, రంగారావు, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ కూల్చివేతపై కేసు

బాలానగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ ఫేజ్-2 పారిశ్రామికవాడలోని గతనెల 20న ఓవర్‌హెడ్ ట్యాంక్ కూల్చివేతపై బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలానగర్ కో ఆపరేటివ్ సొసైటీకి చెందిన వాటర్ ట్యాంక్‌ను కూల్చివేసారని బాలానగర్ కో ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ (సీఐఈ) వైస్‌చైర్మెన్ భరత్‌వీర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ట్యాంక్ కూల్చివేతపై గాంధీనగర్ పారిశ్రామికవాడకు చెందిన నలుగురి పేర్లను ఫిర్యాదులో పేర్కొనడంతో పోలీసులు ఐపీసీ 427 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.



కేఎం ప్రతాప్‌ను కలిసిన దుర్గామాత ఆలయ కమిటీ సభ్యులు

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి

షాపూర్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వినాయకనగర్‌లో దుర్గామాత ఆలయ పునర్నిర్మాణానికి సహకరించమని రంగారెడ్డి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్‌ని కలిసి కోరినట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. దుర్గామాత ఆలయ పునర్నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నర్సింగరావు, నదిమ్రాయి, యాదగిరి, వెంకటయ్య, చంద్రయ్య, సుధాకర్, నందూ సింగు, మురళి, పాండు, నాగరాజు, అనంతయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సమావేశం



ఎమ్మెల్యేతో కృష్ణారావు

కూకట్‌పల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపికైన రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ సమావేశంపై ఎన్నికలపై చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లిలో చేసిన అభివృద్ధి పనులను స్థానిక ప్రజలు మర్చిపోలేరని, ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ అందించే దిశగా కృషి చేస్తానని కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

- కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

ధోబీఘాట్ పనులను ప్రారంభించండి

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ధోబీఘాట్‌లో మౌలిక వసతుల కల్పనలో రాజీపడొద్దని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శుక్రవారం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేపీహెచ్‌బీ మూడు, ఏడో ఫేజ్‌లలో ధోబీఘాట్లను మోడ్రన్‌గా తీర్చిదిద్దేందుకు ఎన్నికల ముందు నిధులు మంజూరు అయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించాలని డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్‌కు సూచించారు. ఇంకా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి నిధులు తెచ్చి పరిష్కారం చూపుతామని అసోసియేషన్ సభ్యులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు.



సాంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

వీఎన్ఆర్ వీజేఐటీలో 2కె24 కల్చరల్ ఫెస్టివల్

నిజాంపేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బాచుపల్లి వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి కళాశాలలో సిన్టిలేషన్స్ 2కె24 కల్చరల్ ఫెస్టివల్ శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు రంగురంగు సాంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. అనంతరం ర్యాంప్ వాక్ చేసిన విద్యార్థులకు మిస్టర్ సిన్టి అండ్ మిస్‌సిన్టి పేరిట బహుమతులు ప్రదానం చేశారు. క్రేసెండో సభ్యులు, కొంచెం హట్కే చిత్రబృందం సందడి చేయగా ప్రముఖ చలనచిత్ర గాయకులు హరిచందన్, రమ్యబెహర, దినకరన్ బృందం తమ పాటలు, సంగీతంతో అందరినీ ఆకట్టుకున్నారు.

ఆర్‌యూబీ ముంపు సమస్య త్వరలో పరిష్కారం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) వద్ద ఎన్నోఏళ్లుగా ఉన్న ముంపు సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద రూ.4 కోట్ల అంచన వ్యయంతో చేపడుతున్న బాక్స్ కల్వర్ట్, వరద నీటి కాల్వ నిర్మాణ పనులను కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా బాక్స్‌కల్వర్ట్, వరదనీటి కాల్వ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనుల్లో వేగం పెంచాలని, అలసత్వం ప్రదర్శించొద్దని అధికారులను ఆదేశించారు. వర్షం పడిన ప్రతీసారి ఈబ్రిడ్జి వద్ద భారీగా వరదనీరు నిలిచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయన్నారు. వర్షాకాలంలో వాహనదారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని త్వరలోనే వారి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. నియోజకవర్గంలో అనేక రోడ్లు, లింక్‌రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించి ప్రజలకు ట్రాఫిక్ రహిత ప్రయాణం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈ కేవీఎస్ రాజు, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆలయ పునర్నిర్మాణానికి సహకారం



జీడిమెట్ల డివిజన్ వినాయకనగర్‌లో దుర్గామాతా ఆలయ పునర్నిర్మాణాకి సహకరించాలని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్, ఆయన కుమారుడు విశాల్‌ను కోరిన ఆలయ కమిటీ సభ్యులు.

\- జీడిమెట్ల, ఆంధ్రజ్యోతి

నిర్ణయాధికారంతోనే మహిళా సాధికారిత సాధ్యం

ప్రముఖ రచయిత్రి పోపూరి లలిత కుమారి



లలితకుమారిని సత్కరిస్తున్న తుషార అలూరి, సమీర

హైదర్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదర్‌నగర్ హోలిస్టిక్ ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్ రామచంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రసాహిత్య అకాడమీ గ్రహీత ప్రముఖ రచయిత్రి పోపూరి లలితకుమారి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపై అసమానతలు పోలేదని, అన్ని రంగాల్లో మహిళలను సమానంగా ప్రోత్సహిస్తేనే ఉన్నత స్థాయికి చేరతారన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ తుషారా అలూరి, సమీర అలూరి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శంషాబాద్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కన్హా శాంతివనం సందర్శనకు నేడు భారత ఉప రాష్ట్రపతి రానున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందిగామ పరిసరాల్లో నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. హైదరాబాద్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను గొల్లపల్లి టోల్‌గేట్ వయా పెద్దగోల్కొండ మీదుగా ఇండియన్ బేకరీ(తొండుపల్లి), బుర్జుగడ్డ వద్ద యూటర్న్ తీసుకొని ముచ్చింతల్, మన్సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు, అమీర్‌పేట్, తిమ్మాపూర్, షాద్‌నగర్ మీదుగా మళ్లిస్తారు. అలాగే, గచ్చిబౌలి నుంచి వచ్చే ట్రాఫిక్‌ను పెద్దగోల్కొండ టోల్‌గేట్, మన్సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు, అమీర్‌పేట్, తిమ్మాపూర్, షాద్‌నగర్ మీదుగా మళ్లిస్తారు. షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ట్రాఫిక్‌తోపాటు పెంజర్ల ఎక్స్‌రోడ్డు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను అమీర్‌పేట్ మన్సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు నుంచి పెద్దగోల్కొండ టోల్‌గేట్, శంషాబాద్, హైదరాబాద్ వైపు మళ్లిస్తారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పైన తెలిపిన ప్రాంతాల్లోనే ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని జాయింట్ సీపీ పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.

ఎస్ఐబీలో ఏకచ్ఛత్రాధిపత్యం

(5వ పేజీ తరువాయి)

కెమెరాలను ఆపివేసి, ఏళ్ల తరబడి హార్డ్ డ్రైవ్స్‌లో ఉన్న డాటాను ధ్వంసం చేసి, వాటి స్థానంలో కొత్త హార్డ్ డ్రైవ్‌లను ఏర్పాటు చేసినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. పోలీసులు ప్రణీత్ కుమార్‌పై పలుసెక్షన్‌లతోపాటు ఐటీ యాక్ట్‌లు ప్రయోగించి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీఆర్‌బీ వర్టికల్ విభాగానికి బదిలీ అయిన ప్రణీత్‌రావును జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ బి. శోభన్, ఎస్ఐ పి.ప్రదీప్ బృందం ఈనెల 12న రాత్రి 10:30కు అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రణీత్‌రావు నుంచి పోలీసులు ఒక లాప్‌టాప్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అప్పటికే సేకరించి పెట్టుకున్న సమాచారంతో ప్రశ్నించగా, ప్రణీత్‌రావు నేరాన్ని అంగీకరించాడు. అనంతరం ఆస్పత్రికి తరలించి కొవిడ్‌తో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ప్రణీత్‌రావు కేసు విచారణ అధికారిగా జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి అప్పగించారు. కాగా.. ఆయన టీమ్‌లో ఇన్‌స్పెక్టర్లు శోభన్, వెంకటేశ్వర్‌రెడ్డి, కె.ఎం రాఘవేంద్ర, శ్రీనివాసులు ఉన్నట్లు వెల్లడించారు.

రూ.7 కోట్లు కొల్లగొట్టారు

- రియల్ ఎస్టేట్ ముసుగులో ఘరానా ఆర్థిక మోసం
- ఆకర్షణీయ లాభాలంటూ నమ్మించారు
- ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ ముసుగులో ఘరానా ఆర్థిక మోసాలకు పాల్పడి రూ. 7 కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్లను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) అధికారులు అరెస్ట్ చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌కు చెందిన తమ్మినీడి వెంకటప్రసాద్ కొర్రపాటి వెంకటరత్నం, వెంకట చిరంజీవి, విఠల్‌రెడ్డి తదితరులు కలిసి జేజే ఇండియా ఇన్‌ఫ్రా ప్రై.లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థను ప్రారంభించారు. దానికి తమ్మిడి వెంకటప్రసాద్ ఎండీగా, వెంకటరత్నం మార్కెటింగ్ ఏజెంటుగా ఉన్నారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించారు. మహేశ్వరం, గచ్చిబౌలి, ఆమనగల్, శిల్పారామం తదితర ప్రాంతాల్లో వెంచర్స్, వ్యవసాయ భూములు ఉన్నాయని చూపించారు. సరిగ్గా మూడేళ్లలో ప్రాజెక్టులు పూర్తవుతాయని నమ్మించారు. ముందుగా పెట్టుబడి పెట్టినవారికి వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో రూ.10 వేలకు ఎస్ఎఫ్‌టీ చొప్పున కేటాయిస్తామని, ఆ తర్వాత ప్రతి నెల ఒక్క ఎస్ఎఫ్‌టీకి రూ.100ల చొప్పున అద్దె చెల్లిస్తామని అలా 30 నెలల్లోనే పెట్టుబడి డబ్బుకు అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించారు. ఆకర్షణీయమైన బ్రోచర్లు, పేపర్ ప్రకటనలు ఇచ్చి కస్టమర్స్‌ను ఆకర్షించారు. వారి మాటలు నమ్మి పెట్టుబడుల రూపంలో ఎనిమిది మంది బాధితులు రూ.3.56 కోట్లు డబ్బులు చెల్లించారు. డబ్బులు చేతికి అందిన తర్వాత నిందితులు లాభాలు ఇవ్వడం అటుంచి స్పందించడం మానేశారు. దీంతో బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. డీసీపీ కె.ప్రసాద్, ఏసీపీ ఎస్. రవీందర్ పర్యవేక్షణలో ఈవోడబ్ల్యూ పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితులు తమ్మిడి వెంకట ప్రసాద్, కొర్రపాటి వెంకటరత్నంలను అరెస్టు చేశారు. వారిని విచారించిన క్రమంలో సుమారు 15 మంది నుంచి రూ.7 కోట్లు వసూలు చేసినట్లు తేలింది. జేజే ఇన్‌ఫ్రాతో పాటు.. తరిణి అవెన్యూ, ఎల్ఎల్‌పీ పేరుతో సంస్థలు ఏర్పాటు చేసి పెట్టుబడుల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.



శాంతసిన్హాను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

'మహిళలు గొప్పగా రాణిస్తున్నారు'

చందానగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు పురుషుల కంటే అన్ని రంగాల్లో గొప్పగా రాణిస్తున్నారని రామన్ మెగసెసే, పద్మశ్రీ అవార్డుల గ్రహీత రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతసిన్హా అన్నారు. సంకల్ప ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ 20 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని చందానగర్ స్వాగత్ హోటల్‌లో రోజి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారు పాల్గొన్నారు. కార్యక్రమానికి శాంతసిన్హా ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వివిధ రంగాల్లో సమాజ సేవకులకు ఎక్సలెన్స్ అవార్డులు అందజేశారు. ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు, చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రులపై డీసీఏ అధికారుల దాడి

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఔషధాలను నిల్వ చేసిన వరంగల్ జిల్లా భూపాల్‌పల్లి, నగరంలోని బండ్లగూడలోని ఆస్పత్రులపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడి చేసి రూ. 13 లక్షల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నారు. భూపాలపల్లి ప్రధాన రహదారిలో నిర్వహిస్తున్న బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోదాలు నిర్వహించి నిల్వ చేసిన ఫిజీషియన్ శాంపిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 11.83 లక్షలు ఉంటుందని భూపాలపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. బండ్లగూడ, ముత్తుజాబాగ్‌లోని షిఫా ఆస్పత్రిలో నిల్వ చేసిన రూ.1.20 లక్షల మందులను సీజ్ చేశారు. కేసులు నమోదు చేశామని హైదరాబాద్ డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ టి.రాజమౌళి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మి తెలిపారు.

అదనపు అంతస్తుకు రూ.1.20 కోట్లు

- డిమాండ్ చేసిన విలేకరి, సెక్షన్ ఆఫీసర్
- పోలీసులను ఆశ్రయించిన నిర్మాణదారుడు.. ఇద్దరి అరెస్టు

బంజారాహిల్స్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అదనపు అంతస్తు నిర్మించుకునేందుకు ఏకంగా రూ.1.20 కోట్లను ఓ విలేకరి, జీహెచ్ఎంసీ సెక్షన్ ఆఫీసర్ డిమాండ్ చేశారు. అంత డబ్బు ఇవ్వలేనని అదనపు అంతస్తు నిర్మాణాన్ని కూడా నిర్మాణదారుడు విరమించుకున్నాడు. అయితే, వేధింపులు ఆగలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు.10లో ప్రసాద్ భవన నిర్మాణం చేపట్టాడు. ఆయనకు రెండు అంతస్తుల వరకు నిర్మాణానికి అనుమతి ఉంది. నిబంధనలు అతిక్రమించి మూడో అంతస్తు నిర్మాణం చేపట్టారు. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఇదిలా ఉండగా, నిర్మాణదారుడి వద్ద నుంచి డబ్బు లాగేందుకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారి విశాల్, విలేకరి ఆకుల కిరణ్‌గౌడ్ పథకం వేశారు. ఈ మేరకు విశాల్ కొద్ది రోజుల క్రితం నిర్మాణదారుడు ప్రసాద్ వద్దకు వెళ్లి భవనంపై ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పాడు. ఫిర్యాదుదారుడైన కిరణ్‌గౌడ్‌తో మాట్లాడుకోవాలని సూచించాడు. ప్రసాద్ ఒప్పుకొని కిరణ్‌కు ఫోన్ చేశాడు. ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానని చెప్పిన కిరణ్ అదనపు అంతస్తు నిర్మించుకోవాలంటే జీహెచ్ఎంసీ, మీడియాకు కలిసి రూ.1.20 కోట్లు ఇవ్వాలని అడిగాడు. దీనికి ప్రసాద్ ఆశ్చర్యపోయాడు. నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం అడిగాడు. అనంతరం అదనపు అంతస్తు నిర్మాణం ఆలోచనను విరమించుకున్నాడు. కిరణ్ వేధింపులు ఆగలేదు. ప్రతీ రోజు ఫోన్ చేసి డబ్బు ఎప్పుడు ఇస్తారు అంటూ వేధించడం మొదలుపెట్టాడు. దీంతో నిర్మాణదారుడు పశ్చిమ మండలం డీసీపీ దృష్టికి తీసు కెళ్లగా ఆయన సూచన మేరకు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కిరణ్ డబ్బు అడిగినట్లు ఆడియో టేపులతోపాటు ఇతర ఆధారాలు అందజేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు కిరణ్‌గౌడ్‌తో పాటు విశాల్‌ను అరెస్టు చేశారు. సెక్షన్ 384, 506, 120బి ఐపీసీ కింద కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కిరణ్‌గౌడ్ గతంలో భవన నిర్మాణదారుల వద్ద డబ్బు డిమాండ్ చేసిన కేసులు అనేకం ఉన్నాయని తేలింది. ఓ నిర్మాణదారుడి వద్ద డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బంజారాహిల్స్‌తో పాటు మరో పోలీసుస్టేషన్‌లో కూడా కిరణ్‌గౌడ్ పై కేసులు ఉనట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి వరం: ఎమ్మెల్యే

గాజులరామారం, మార్చి15(ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి పథకం ఆడపిల్లలకు వరంలాంటిదని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను కార్పొరేటర్ రావుల శేషగిరి, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్‌తో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన నాయకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. లబ్ధిదారులకు రూ. 41 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రేణుక, శ్రీనివాస్‌యాదవ్, విజయ్‌రామ్ రెడ్డి, బాలరాజు, అశోక్, నగేష్, చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిఎద్దడి లేకుండా చర్యలు

షాపూర్‌నగర్: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని జలమండలి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు వేసవిలో నీటికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, జలమండలి డీజీఎం అప్పల నాయుడు, జలమండలి మేనేజర్ రోహిణి, సిబ్బంది అనూష, రమ్య, భారతి, పూజిత పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



రోడ్‌షోకు వెళ్తున్న బీజేపీ శ్రేణులు

ప్రధాని రోడ్‌షోకు బీజేపీ శ్రేణులు

గచ్చిబౌలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో పార్లమెంట్‌లో కాషాయ జెండా ఎగరవేస్తామని శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మల్కాజ్‌గిరిలో ప్రధాని రోడ్‌షోకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో రోడ్‌షోకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. దేశంలో మూడోసారి బీజేపీ అధికారం చేపట్టబోతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని, దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, నాగులగౌడ్, జితేందర్, రాజుశెట్టి, రామిరెడ్డి, రమేష్, ఆకుల లక్ష్మణ్, బాబురెడ్డి, చంద్రమోహన్, రవీందర్‌నాయక్, వెంకటేష్, నరసింహయాదవ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రతినిధులు

ప్రపంచ నిద్ర దినోత్సవం

రాయదుర్గం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో డ్రౌసి డ్రైవింగ్ పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ విభాగం, ఆర్టీసీ ఉన్నతాధికారులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రంకెన్‌డ్రైవ్ చేసి వాహనం నడిపితే ఏమవుతుందో మనందరికి తెలుసునని, అందుకే తాగి వాహనం నడపకుండా ఈ మధ్య జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం కూడా ప్రమాదాల బారిన పడకుండా వివిధ రకాల కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తుందన్నారు. మరో కారణంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అది నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం మంచిదికాదన్నారు. డ్రంకెన్ డ్రైవ్, నిద్రమత్తులో డ్రైవింగ్ వల్ల దేశంలో దాదాపు 40 శాతం యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కృష్ణకాంత్, ఆర్టీసీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శైలజామూర్తి, డాక్టర్ పి.శ్రీనివాస్, కాంటినెంటల్ ఆస్పత్రి ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ గురు ఎన్‌రెడ్డి, ఏఎనీజ ఇన్ఫోటెక్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ బోడతో పాటు పలువురు పాల్గొన్నారు.



కట్టమైసమ్మ చెరువులోకి దూసుకెళ్లిన కారు

చెరువులోకి దూసుకెళ్లిన కారు

గాజులరామారం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు రోడ్డు ప్రక్కన ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. సూరారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సూరారంలో నివాసం ఉండే దుర్గారావు గాగిల్లాపూర్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. రెండు షిఫ్టులు డ్యూటీ చేసి సూరారంలోని ఇంటికి వస్తున్న సమయంలో సూరారం కట్టమైసమ్మ చెరువు సమీపంలో ముందు వాహనాన్ని తప్పించే క్రమంలో నిద్రమత్తు కారణంగా కారును చెరువులోకి దూసుకెళ్లింది. విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో కారును బయటకు తీశారు. కారు నడుపుతున్న వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. కారును స్టేషన్‌కు తరలించారు.

● సంక్షిప్త వార్తలు

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై కృతజ్ఞతలు

మియాపూర్: కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై ఉత్తర్వులు జారీ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి కమ్మవారి సేవాసంఘాల సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ధన్యవాదాలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ప్రసాద్, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, వెంకట్‌రావు, చంద్రమౌళి ఉన్నారు.

- **నిజాంపేట్:** ఎన్నో తరాలుగా ఎదురు చూస్తున్న కమ్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కమ్మ సంఘ నాయకుడు వాకలపూడి రంగరాయప్రసాద్ ధన్యవాదాలు తెలియజేశారు.

యాదవకార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

జీడిమెట్ల : రాష్ట్ర ప్రభుత్వం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యూత్ అధ్యక్షుడు ఎర్ర కార్తీక్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిరోజ్‌గూడలో మహిళా దినోత్సవం

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధి ఫిరోజ్‌గూడ పోచమ్మ ఆలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు శంకర్‌రెడ్డి, బాలానగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బఫర్ జోన్‌లోని నిర్మాణం కూల్చివేత



భవనాన్ని కూల్చుతున్న దృశ్యం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మండలం బాలాజీనగర్ డివిజన్‌లోని కాముని చెరువుకు సంబంధించిన బఫర్ జోన్ రాఘవేంద్రనగర్‌లో అక్రమ నిర్మాణాలు వెలిశాయంటూ ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం అధికారులు చర్యలకు దిగారు. నీటి పారుదల అధికారులు గత బుధవారం కూకట్‌పల్లి తహశీల్దారు, మూసాపేట సర్కిల్ ఉపకమిషనరు ఉత్తర్వుల దృష్ట్యా ఆయా శాఖల అధికారులు శుక్రవారం కూల్చివేత చేపట్టారు. బఫర్ జోన్‌లోని ఓ భవనాన్ని రెవెన్యూ, నీటిపారుదల, జీహెచ్ఎంసి సిబ్బంది డ్రిల్లింగ్, జేసీబీతో కూల్చారు.

మృతదేహం స్వాధీనం

చందానగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగండ్ల రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద సుమారుగా 50-55 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జీడిమెట్ల: ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బహదూర్‌పల్లి ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ మహబూబ్(47) హౌజ్ కీపింగ్ పని చేస్తుంటాడు. ఈనెల 14వతేది రాత్రి 7.30 గంటల సమయంలో దేవరయాంజాల్ నుంచి కొంపల్లి వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. కమెండో కెనాల్స్ వద్ద గురుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై మృతి చెందాడు. ఈమేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.